

ఆంధ్రరాష్ట్రమే మన పరమావధి

శ్రీ శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రి

ప్రతివిధంగా చూసినా, యెన్నివిధాల ఆలోచించినా, యెంత తర్జనభర్జన చేసి పరిశీలించినా, మనకి వెంటనే కావలసింది వొక్కటే వున్నది.

అది ఆంధ్రరాష్ట్రం.

మన ధ్యేయం, మన ప్రాప్యం, మన పరమావధి— సర్వమూ మనకి ఆంధ్రరాష్ట్రమే.

మనకి ఆర్థికస్వాతంత్ర్యమూ కావాలి; సేన అంతా హిందూమయమూ కావాలి; సంపూర్ణస్వరాజ్యమూ కావాలి.

నిజంగా, వీటి విషయంలో నాకు ప్రాతికూల్యం యేమీ లేదు. ఇవి యెంత త్వరగా కొనసాగితే నేనంత యెక్కువగా ఆనందిస్తాను.

కాని, వీటన్నిటికంటే మనకి మొదటిది ఆంధ్రరాష్ట్రం.

ఏమంటే —

ఆంధ్రరాష్ట్రం యేర్పడకపోతే మన శక్తులు ఏకముగా కావు. మనకి ప్రత్యేకవ్యక్తిత్వం యేర్పడదు. అఖిలభారతీయవిషయాలలో మన వంతు మనం నిర్వహించుకునే యోగ్యత కలగదు.

స్వరాజ్యసాధనప్రయత్నాలలో మన పూరా పేరూ కనపడదు.

ఇంతే కాదు.

స్వాయత్తమైన ఆంధ్రరాష్ట్రమే సాధించుకోకపోతే, మనం పరాయత్తమైన స్వరాజ్యం యెంతమాత్రమూ సాధించలేము.

ఏతావతా :

పారతంత్ర్యం అనేది మనకి వొక్కళ్లకే లేదు.

ఆవిషయంలో సేతువు మొదలు శీతాచలం దాకా వున్న భారతీయులందరూ వొకటే నోమే నోచారు.

కాని, మన పని అంతటితో తీరలేదు.

మనం దాసులకు దాసులుగా వున్నాము; హీనులకు హీనులమై వున్నాము.

మద్రాసురాష్ట్రం అంతా వొక్కరిది కాదు, నలుగురిది.

అయినా, నలుగురి సమష్టిభూభాగంలోనూ సగం కంటే యెక్కువ మనది. నలుగురి సంఖ్యలోనూ సగం కంటే హెచ్చు సంఖ్య మనది. నలుగురూ చెల్లించే డబ్బులోనూ సగానికి పైగా మనది.

కాని—

జలాధారాలు దక్షిణానికి ఎక్కువగా యేర్పరచబడ్డాయి. రైలురోడ్లుకూడా అక్కడే జాస్తీగా వున్నవి. రోడ్లు అక్కడ దీర్ఘంగా తయారైనవి. విద్యుచ్ఛక్తికూడా అక్కడే మోసిపోతున్నది. సర్కారు వుద్యోగాలలో అక్కడివారు యెక్కువగా వున్నారు. సర్కారులో వారికి పలుకుబడి విపరీతంగా వున్నది.

కారణం ?

"మిమ్మల్నెవరైనా అడ్డుపెట్టారా?" అంటే లేదని వొప్పుకుంటాను.

"ఆరవల వెనక లేనా [illegible] బొట్టు పెట్టి పిలుచుకు వచ్చి చెయ్యిపట్టుకు లేవనెత్తారా?" అంటే లేదనీ అంగీకరిస్తాను.

"కనక, అరవలలాగే మీరూ పాటుపడండి" అంటే మాత్రం అది సాధ్యం కాదు.

ఎందుచేతనంటే —

వారు సర్వమూ ఆక్రమించుకుని వున్నారు. ఇక మనకి చోటు దొరకదు.

లేనే లేదు!!

వారు ఇప్పటికే బాగా జాగ్రత్తపడ్డారు. మనకి అవకాశాలూ లేవు. ఉండినా వారిని కలుసుకోనూ లేము.

అందుచేత, విడిపోవడం వొక్కటే మనకి మిగిలింది. అంతకంటే మరి గత్యంతరం లేదు.

ఇది మనం యెప్పుడో చేసుకుని వుండవలసిన పని.

అసలే ఆలస్యంగా మేలుకుని, మేలుకున్న యెన్నాళ్లకో ప్రయత్నాలు ప్రారంభించాము.

దేశం అంతటా ప్రబోధం కలిగింది. జాతి కంతకీ చురుకు పుట్టింది.

కాని, బందరు వుప్పెనలాగ, ఇంతలో కాంగ్రెస్సువెల్లువ వచ్చి, మనమీద యిసకమేటలు వేసినది.

మనకి కలిగిన ప్రబోధం అంతా విస్మృతిసముద్రం పాలయింది.

మన ప్రయత్నాలన్నీ తుక్కు తుక్కయిపోయాయి.

చివరికి స్వరాజ్యమూ రాలేదు! ఆంధ్రరాష్ట్రమూ యేర్పడలేదు!!

ఈస్థితిలో మనకి మళ్లీ మెలకువ వచ్చింది. ఆంధ్రరాష్ట్రం అత్యవసరం అని మళ్లీ బోధపడింది.

సంతోషమే!

కాని, చూడగా దిక్కులన్నీ అంధకారబంధురాలై వున్నవి.

మనలో లిబరల్సుకి నామరూపాలు లేవు. పీపిల్సుకి నిలవడానికే ఆస్కారం లేకపోయింది. జస్టిస్సు పూర్తిగా పరాజిత మయిపోయింది.

ప్రబలమయి వున్న కాంగ్రెస్సులో [illegible] వియ్యంకులు కర్ణధారులై, మనవాళ్లు బడిపిల్లకాయలయిపోయారు.

దీనివల్ల నిజంగా సందిగ్ధపరిస్థితు లేర్పడినవి.

ఏమిటంటే —

మనవారు కాంగ్రెస్సుమీద ఆశావదులుకోలేరు; కాంగ్రెస్సుని లోపుచేసుకుని వినియోగపరుచుకోనూలేరు.

ఉన్నవల్లా యేమిటంటే —

మన పన్నెండు జిల్లాలూ విడిపోయి ప్రత్యేకరాష్ట్రంగా యేర్పడితే మనకి లాభం. విడిపోకుండా యిప్పటి మద్రాసురాష్ట్రం యిలాగే వుండిపోతే అరవలకు లాభం.

అందుచేత ఆంధ్రరాష్ట్రనిర్మాణానికి అరవల ప్రాతికూల్యం పూర్తిగా వుంది.

రాజగోపాలాచారిగారు ఆంధ్రరాష్ట్రనిర్మాణానికి ప్రతికూలురు కాని, అనుకూలురు కారు.

గాంధిగారి వియ్యంకుణ్ణి యెందుకు నమ్మకపోవాలి అంటే, వారినే యెందుకు నమ్ముకుని కూచోవాలి!

ఆంధ్రరాష్ట్రం నిర్వహించబడాలంటే, కల్లపాకలు యెక్కువగా యేర్పరుచుకోవాలని చెప్పిన రాజగోపాలాచారిని అనుమానించవద్దనడం వివేకం అనిపించుకుంటుందా ?

ఇప్పటికి యాభై సంవత్సరాలుగా, కాంగ్రెస్సు న్యాయకార్యనిర్వాహకశాఖలు విడదియ్యబడాలని మొత్తుకుంటూ వుంటే, మంత్రిపదవి అధిష్ఠించేదాకా తాము కూడా ఆమాట అంటూ వచ్చి, యివాళ నిస్సంకోచంగా అది తప్పుపని అని యెదిరించగలిగిన ఆచారిగారు, వొక్కమాటు కాంగ్రెస్సుకమిటీ ఆజ్ఞాపించినంత మాత్రాన ఆంధ్రమండలాలను నిజంగా విడదీయిస్తారని నమ్మడం పిచ్చిపని కాదూ ?

కనక, ఆంధ్రులమైన మన మందరమూ నడుములు కట్టాలి.

కాంగ్రెస్సు, జస్టిస్సు, పీపిల్సు, లిబరల్సు— ఈ భేదాలన్నీ మనం మరిచిపోవాలి.

మన డబ్బు, మన బుద్ధి, మన శక్తి— సర్వమూ ఆంధ్రోద్యమంకోసం వినియోగపరుచుకోవాలి.

అప్పుడుకాని మనం కృతకృత్యులము కాలేము. అయితేగాని మనకి భవిష్యత్తు లేదు.